ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 14 మార్చి 2025

విహారంతో విజ్ఞానం

నిధులిచ్చిన కూటమి ప్రభుత్వం

విద్యార్థులు, ఉపాధ్యాయుల హర్షం

వైసీపీ హయాంలో పైసా లేదు..



విజ్ఞాన విహార యాత్రకు వెళుతున్న విద్యార్థినులు (ఫైల్)

విజ్ఞాన యాత్రలకు 286 మంది విద్యార్థుల ఎంపిక

ధర్మవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి చేసిన ప్రకటనలు ఆచరణలో అమలు కాలేదు. విద్యార్థుల విజ్ఞాన, విహార యాత్రలకు నిధులు నిలిపివేయడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులు, ఉన్నతపాఠశాలల్లో 7,8,9 తరగతులు చదువుతున్న విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలకు తీసుకెళ్లాల్సి ఉండేది. వాటికి సమగ్రశిక్ష ద్వారా నిధులు కేటాయించాల్సి




ఉంది. వైసీపీ ప్రభుత్వం విజ్ఞాన విహార యాత్రలకు నిధులు కేటాయించలేదు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలకు తీసుకెళ్లేందుకు శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ద్వారా నైపుణ్యాభివృద్ధి, మనోవికాసం, శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచేలా కూటమి ప్రభుత్వం సిద్ధమయింది. అందులోభాగంగా జిల్లాలోని ప్రాథమిక, ఉన్నతపాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన విహార యాత్రల కోసం ప్రభుత్వం ఇటీవలే రూ.2.79 లక్షల నిధులు విడుదల చేసింది. ఈనెల 31వ తేదీలోగా నిధులు వినియోగించుకోవాలని సమగ్రశిక్ష ఉన్నతాధికారులు జిల్లా సైన్స్ ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఈనెల 17న 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థులను ముఖ్యమైన ప్రాంతాలకు తీసుకెళ్లడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. 7,8,9 తరగతుల విద్యార్థులను బెంగళూరు, హైదరాబాద్, శ్రీహరికోట వంటి ప్రాంతాలకు తీసుకెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అరకొర నిధులు

విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్లడానికి ఒక్కొక్క విద్యార్థికి రాష్ట్రపరిధిలో రూ.200, రాష్ట్రం వెలుపల రూ.2వేల చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఈ నిధులు విహార యాత్రలకు సరిపోవు. విహార యాత్రలకు తీసుకెళ్లాలంటే ఖర్చుతో కూడిన పని. మరింత పెంచితే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 125 ప్రాథమిక పాఠశాలల నుంచి 196 మంది విద్యార్థులు, ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్న 90 మంది విద్యార్థులు, ప్రాజెక్టు తయారీకి సహకరించిన 25 మంది ఉపాధ్యాయులను యాత్రలకు తీసుకెళ్లనున్నారు.



ఈనెల 31లోగా తీసుకెళ్తాం



జిల్లా వ్యాప్తంగా విజ్ఞాన విహార యాత్రకు ఎంపికైన విద్యార్థులను ఈ నెల 31లోగా విజ్ఞాన విహార యాత్రలకు తీసుకెళ్తాం. ఈ యాత్రల వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుంది. వారిలో ఆత్మస్థైర్యం, బాహ్య ప్రపంచంలోని విషయాలు తెలుసుకోవడం వల్ల జీవితం పట్ల అవగాహన కలుగుతాయి.

-కిష్టప్ప, డీఈఓ

యాత్రలతో ఉపయోగాలు



విజ్ఞాన విహార యాత్రల వల్ల విద్యార్థులకు వాస్తవ ప్రపంచ అనుభవాలు, మెరుగైన అభ్యాసం, సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయి. విద్యార్థుల్లో ఆలోచన శక్తి, నైపుణ్యత మెరుగుపడుతుంది. ప్రపంచంలో జరుగుతున్న వాస్తవవిషయాలు, ప్రయోగాలపై అవగాహన శక్తి పెంపొందుతుంది.

-ఇర్షాద్‌వలీ, సైన్స్ ఉపాధ్యాయుడు, కొత్తచెరువు


శాస్త్రవేత్త కావాలన్నదే నా ఆకాంక్ష



పాఠశాలలో ఉన్న పరిమిత వనరులతో ఉపాధ్యాయుల సహకారంతో చిన్న చిన్న ప్రయోగాలు చేస్తున్నా. భవిష్యత్తులో శాస్త్రవేత్త కావాలన్నదే నా ఆకాంక్ష. ఇటీవల ఉపాధ్యాయులు విజ్ఞాన, విహార యాత్రకు నన్ను ఎంపిక చేశారు. విషయం తెలియగానే సంతోషపడ్డా. నాలాంటి పేద విద్యార్థులకు ఈ విహార యాత్ర ఎంతో ఉపకరిస్తుంది. బయట ప్రపంచంలోని కొత్తకొత్త విషయాలు తెలుసుకుంటా.

-జగదీష్, 9వతరగతి, ఓబులరెడ్డి పల్లి, తలుపుల మండలం

పరిశోధనలు చేయడమే లక్ష్యం



భవిష్యత్తులో కొత్త కొత్త పరిశోధనలు చేస్తా. కంపెనీని స్థాపించి పది మందికి ఉపాధి కల్పించాలన్నదే నా ధ్యేయం. విద్యావైజ్ఞానిక ప్రదేశాలను సందర్శించడం వల్ల ఆలోచనలు కలుగుతాయి. సైన్స్ మ్యూజియంలు, అంతరిక్ష కేంద్రాలు, గణిత మ్యూజియంలు చూడటం వల్ల పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుంది. ఈ యాత్రల వల్ల ప్రకృతి సౌందర్యం ఆస్వాదించవచ్చు.

-నవ్యశ్రీ, 9వ తరగతి, దేమకేతేపల్లి, చిలమత్తూరు మండలం

నిధులు పెంచాలి



విజ్ఞాన, విహార యాత్రల వల్ల విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించడం శుభపరిణామం. విద్యార్థులకు ఇచ్చిన గ్రాంటు ఏ మాత్రం సరిపోదు. అరకొర గ్రాంటు వల్ల ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేసే పరిస్థితి వస్తుంది. పేద విద్యార్థుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని యాత్రకు సరిపడా నిధులు విడుదల చేయాలి.

- పోతలయ్య, రాష్ట్ర సహాయకార్యదర్శి, ఏఐఎస్‌బీ, ధర్మవరం

లక్ష్యాలను తెలుసుకుంటారు



విజ్ఞాన, విహార యాత్రల ద్వారా ఐఐటీలు, అంతరిక్ష పరిశోధన సంస్థలు, విశ్వేశ్వరయ్య మ్యూజియం లాంటివి చూపించడం వల్ల వినూత్నంగా ఆలోచించి భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు దోహదపడతాయి. నూతన ప్రభుత్వం మొత్తం నిధులు ఈ విహార యాత్రకు సమకూర్చడం విద్యార్థులకు లాభదాయకం.

- తనూజ్‌కుమార్, జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్

వైసీపీ హయాంలో నిర్వీర్యం



వైసీపీ హయాంలో విజ్ఞాన, విహార యాత్రలను నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం విజ్ఞాన విహార యాత్రలు నిర్వహించడం హర్షణీయం. ఈ యాత్ర వల్ల విద్యార్థులకు మేధాశక్తి పెరుగుతుంది. లోకజ్ఞానం తెలుస్తుంది. విద్యార్థులకు చేసే ఖర్చు మరింత పెంచాలి.


-నాగార్జున, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

ప్రశాంతంగా హోలీ చేసుకోండి: ఎస్పీ



పుట్టపర్తి రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ వి.రత్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హోలీపండుగ సందర్భంగా ఎలాంటి గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లవద్దని, తాము అనుక్షణం పరిశీలిస్తున్నామని తెలిపారు. ముఖ్యమైన కూడళ్లు, పట్టణాలు, కాలనీరహదారులపై సీసీ కెమెరాలతో పాటు డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించరాదని తెలిపారు. ద్విచక్రవాహనదారులు సైలెన్సర్లను తొలగించి శబ్దాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కలుషితమైన, ప్రమాదకరమైన రంగులపట్ల జాగ్రత్తగా ఉండాలని, పర్యావరణహితమైన రంగులను వాడాలని సూచించారు. ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మహిళలను వేధించినా కఠినచర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఉష్ణోగ్రతలు



గురువారం

గరిష్ఠం	37.0
కనిష్ఠం	23.0



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 శుక్రవారం సాయంత్రం	5.08 శనివారం ఉదయం
కదిరి	6.30 శుక్రవారం సాయంత్రం	5.09 శనివారం ఉదయం
ధర్మవరం	6.33 శుక్రవారం సాయంత్రం	5.07 శనివారం ఉదయం
హిందూపురం	6.33 శుక్రవారం సాయంత్రం	5.13 శనివారం ఉదయం
పెనుకొండ	6.33 శుక్రవారం సాయంత్రం	5.13 శనివారం ఉదయం

బంధాలు సరిగా లేక..!

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

6

హనుమంత వాహనంపై ఖాద్రీశుడు

గ్రాసం కరువు..!

- పాడి రైతులకు తిప్పలు
- పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేయాల్సిన దుస్థితి
- ట్రాక్టర్ రూ.15వేలు పలుకుతున్న వైనం

నంబులపూలకుంట, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. చేనులో పశువులకు మేత లేదు. వాటి పొట్ట నింపాలంటే గ్రాసం కొనాల్సిందే. దీంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రైతు అడిగినంత చెల్లించాల్సిందే. పశుపోషణకు పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రాసం కోసం పొలాల వద్దకే వెళ్తున్నారు. అక్కడ బేరాలు లేకుండా.. రైతు అడిగినంత ఇచ్చి.. గడ్డి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ట్రాక్టర్ వేరుశనగ కట్టె రూ.15వేలు ధర పలుకుతోంది. బోర్లకింద సాగుచేసిన వేరుశనగ కట్టెను పొలాల వద్దే కొనుగోలు చేసి, తీసుకెళ్తున్నారు. మండలంలో ఎక్కువమంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పొలాల్లో ఎండుగడ్డి కూడా కరువైంది. మూగజీవాలను మేపడానికి మరో మార్గం లేక అధిక ధరలు పెట్టి గ్రాసం కొనుగోలు చేయాల్సి వస్తోందని పాడి రైతులు వాపోతున్నారు.



నంబులపూలకుంటలో వేరుశనగ గ్రాసం తరలిస్తున్న దృశ్యం

యువతకు ఆదర్శం.. మొల్ల

కలెక్టర్ టీఎస్ చేతన్



మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు కవయిత్రి మొల్ల.. నేటి యువతకు ఆదర్శమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని నిరూపించారు కవయిత్రి మొల్ల అని కొనియాడారు. అనంతరం కొత్తచెరువు, ముదిగుబ్బ, బీసీ హాస్టల్ విద్యార్థినులు దేవీప్రియ, అహల్య.. మొల్ల జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, బీసీ సంక్షేమ శాఖాధికారి నిర్మలాజ్యోతి, జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ పాల్గొన్నారు.

పది పరీక్షలకు 104 కేంద్రాలు

17 నుంచి ఎగ్జామ్స్

హాజరుకానున్న 23,730 మంది విద్యార్థులు

ఆరుచోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు

ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఆర్టీసీ

కొత్తచెరువు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 17న పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం 104 కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 23,730 మంది విద్యార్థులు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షాకేంద్రాల్లో విద్యుత్ సౌకర్యంతోపాటు గాలి, వెలుతురు సక్రమంగా అందేలా చూస్తున్నారు. తాగునీరు, వైద్యసిబ్బందిని అందుబాటుఓ ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 449 పాఠశాలలకు చెందిన 23,730 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారిలో 70శాతం మంది బాలురు, 30 శాతం బాలికలు ఉన్నారు. ఇందులో రెగ్యులర్ 22,295 మంది, ప్రైవేటు 1435 మంది, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 780 మంది



ఉన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా రెగ్యులర్ వారితోపాటుగా పరీక్షలు నిర్వహిస్తోంది. 11 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పుట్టపర్తి, కదిరి రెండేసి, పెనుకొండ 4, మడకశిర, ధర్మవరం ఒక్కో సెంటర్‌లో ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు 104 మంది, డిపార్ట్‌మెంటల్ అధికారులు 127 మంది, అడిషనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు 23 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరుగురు, సిట్టింగ్ స్క్వాడ్ 40 మందిని నియమించారు. ఆరు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లను విద్యార్థులు పొందవచ్చన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ

పదో తరగతి పరీక్షలు రాసే రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోంది. విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు చెబుతున్నారు. పరీక్షా సమయానికి అనుగుణంగా బస్సులు నడపనున్నట్లు వారు తెలిపారు.

పది పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని ఎంఈఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో 23,730 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరిలో 22,293 మంది రెగ్యులర్, 1,435 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 104 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 780 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థుల కోసం 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 11 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ప్రథమ చికిత్స, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఈఓ కిష్టప్ప, డీఆర్వో విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్జేడీ

హిందూపురం అర్బన్/కొత్తచెరువు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హిందూపురంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఇంటర్ విద్య ఆర్జేడీ రవి గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా 42 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. 466 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. రెగ్యులర్ కింద 11,766 మందికిగాను 11,388 మంది పరీక్ష రాయగా.. 378 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,156 మందికిగాను 1,068 మంది పరీక్షలు రాయగా.. 88 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ పరీక్షలు ఈ నెల 20వ తేదీన ముగుస్తాయని ఆయన తెలిపారు. ఆయన వెంట డీఐఈఓ రఘునాథరెడ్డి తదితరులు ఉన్నారు.



పరీక్షాకేంద్రంలో ఆర్జేడీ రవి



రోడ్డుపై టమాటా, మిరపను పారవేస్తున్న రైతు లోక్‌నాథ్ రెడ్డి

కడుపు మండిన రైతు..!

అమాంతం పడిపోయిన టామోటా, మిరప ధరలు

రోడ్డుపై పారవేసి నిరసన

గాండ్లపెంట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సేద్యం చేసి విత్తనం వేసిన ప్పటి నుంచి.. తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలు తట్టుకుని.. రేయింబవళ్లు ఇంటిల్లిపాది కష్టపడి ఎలాగో పంట పండించినా.. రైతుకు చివరికి నిరాశే మిగులుతోంది. పంట బాగా వచ్చిందని సంతోషించేలోపు ధరలు పాతాళానికి పడిపోతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినా రైతులకు మద్దతు ధర, గిట్టుబాటు అనేవి నినాదాలుగానే మిగిలిపోతున్నాయి. పెట్టుబడుల మాట అటుంచితే.. కనీసం కోతకోసిన కూలి డబ్బులు కూడా రాకపోతే రైతు పరిస్థితి ఎలా ఉంటుంది..? ఇలాగే గాండ్లపెంట మండలం ఎల్లుగూటివారిపల్లికి చెందిన రైతు లోక్‌నాథ్‌రెడ్డి పరిస్థితి తయారయింది. ఒకటిన్నర ఎకరాలో పచ్చిమిరప, అర ఎకరాలో టమాట పంటను సాగుచేశాడు. సుమారు రూ. 4 లక్షలకు పైగా ఖర్చు చేశాడు. దిగుబడి బాగా వచ్చింది. మార్కెట్‌కు తీసుకెళితే.. టమోట 25 కిలోల బాక్స్ ధర రూ.80, కిలో పచ్చిమిరప రూ. 10నుంచి 15లు మాత్రమే పలుకుతున్నాయి. దీంతో మండల కేంద్రమైన గాండ్లపెంటలో గురువారం టమోట, మిరపను రోడ్డు పక్కన అమ్మడానికి ప్రయత్నించాడు. కొనుగోలు దారులు లేకపోవడంతో విసిగిపోయి కడుపు మండిన రైతు టమోటాలు, మిరపకాయలను రోడ్డుపై పారబోసి.. రైతుల దుస్థితి ఇలా తయారయిందని ఆవేదన చెందాడు. మార్కెట్‌కు తరలించడానికి రవాణా ఖర్చులు, కూలీలు, మార్కెట్‌లో కమీషన్లతో చిల్లిగవ్వకూడా చేతికందకపోగా.. కోతకోసిన కూలీలకు అప్పులు చేసి చెల్లించాల్సి వస్తోందని వాపోయాడు.

రంగుల పండుగ.. హోలీ నేడే



అనంతపురం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ హోలీ వచ్చేసింది. శుక్రవారం హోలీ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా చేసుకోనున్నారు. స్నేహితులు, బంధువులు పరస్పరం రంగులు చల్లుకోవడం ఆనవాయితీ. సహజ రంగులతో హోలీ చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సింథటిక్ రంగుల వాడకంతో అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లేనని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్త వహించకపోతే ప్రమాదమే

హోలీలో వాడే సింథటిక్ రంగులు చర్మంపై దుష్ప్రభావాలను చూపుతాయి. రంగుల్లో రసాయనాలు కలిసుండటం వల్ల అలర్జీ వచ్చే అవకాశం ఉంది. ఆస్మా పీడితులకు సమస్య తీవ్రం కావచ్చు. రంగులు చల్లుకున్నాక ఎండకు వెళితే చర్మం నల్లగా మారొచ్చు, బొబ్బలు కూడా రావొచ్చు. ఈ దుష్ప్రభావాల బారిన పడకూడదంటే ప్రకృతి సిద్ధ రంగులను వాడడం శ్రేయస్కరం. లేదంటే హోలీ ఆడడానికి ముందే శరీరానికి మాయిశ్చరైజర్‌గానీ, కొబ్బరి నూనె గానీ పూసుకోవాలి. తద్వారా రంగులు శరీరానికి అంటే అవకాశం తక్కువ. హోలీ ఆడాక మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి.

- డాక్టర్ చల్లా నీలిమ, చర్మవ్యాధి నిపుణురాలు

పలు రైళ్లకు అదనపు స్టాపేజీలు కొనసాగింపు

విజయవాడ రైల్వేస్టేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు అదనపు స్టాపేజీలను మరో ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. 17011 హైదరాబాద్-సిర్పూర్ కాగజ్ నగర్, 17012 సిర్పూర్ కాగజ్‌నగర్-బీదర్, 12713 విజయవాడ-సికింద్రాబాద్, 12714 సికింద్రాబాద్-విజయవాడ, 12706 సికింద్రాబాద్-గుంటూరు, 12705 గుంటూరు-సికింద్రాబాద్ రైళ్లు ఈ రోజు నుంచి చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 12072 హింగోళిడెక్కన్-ముంబయి సీఎస్ఎన్ టెర్మినస్ అప్ అండ్ డౌన్ రైళ్లు, పర్బూరు, సెలులో 20701, సికింద్రాబాద్-తిరుపతి అప్ అండ్ డౌన్ రైలు మిర్యాలగూడలో, 17646 రేపల్లె-సికింద్రాబాద్ రామన్నపేటలో ఆగుతాయి. 12787 నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ 15, 16 తేదీల్లో మహబూబాబాద్‌లో ఆగుతుంది. 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20న, 17480 తిరుపతి-పూరి ఈ నెల 21న, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఈ నెల 18న, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ రైళ్లు ఈ నెల 16న కొవ్వూరు స్టేషన్‌లో ఆగుతాయి. 20896 భువనేశ్వర్-రామేశ్వరం రైలు ఈ నెల 21న, 20895 రామేశ్వరం-భువనేశ్వర్ రైలు ఈనెల 23న, 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23న, 16583 పుదుచ్చేరి-హౌరా ఈ నెల 19వ తేదీన రాజమండ్రి స్టేషన్‌లో ఆగుతాయి. 16583 యశ్వంత్‌పూర్-లాతూర్ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు, 16584 లాతూర్-యశ్వంత్‌పూర్ ఈ నెల 15న కమలానగర్ స్టేషన్‌లో ఆగుతాయి. 22151 పూణే-ఖాజీపేట ఈ నెల 21న, 22152 ఖాజీపేట-పూణే ఈ నెల 23న మంచిర్యాల స్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

వెబ్ ఆప్షన్లు ఇవ్వండి: డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత డీఎస్సీ శిక్షణకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక గురువారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించామని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 75 మంది ఎస్సీ అభ్యర్థులు, 60 మంది ఎస్టీ అభ్యర్థులు మెరిట్ లిస్టులో ఉన్నారని తెలిపారు. https://mdfc.apcfss.in వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను ఉంచామని, వీరందరూ జ్ఞానభూమిలో పోర్టల్ లేదా https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్‌లో పొందుపరిచిన కోచింగ్ సెంటర్లు అన్నింటికి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోపు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు.

లేపాక్షికి యునెస్కో గుర్తింపునకు కృషి చేయండి

ముఖ్యమంత్రిని కోరిన మైనాస్వామి



ముఖ్యమంత్రికి ఆలయ విశిష్టత చిత్రాలను అందజేస్తున్న మైనాస్వామి

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ సంపదగా లేపాక్షి వీరభద్ర ఆలయానికి యునెస్కో గుర్తింపు కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చరిత్రకారుడు మైనాస్వామి కోరారు. గురువారం ముఖ్యమంత్రిని కలిసి మైనాస్వామి లేపాక్షి ఆలయ విశిష్టతను వివరించారు. యునెస్కో గుర్తింపునకు కావాల్సిన అర్హతలన్నీ ఉన్నాయని తెలిపారు. అందుకు సంబంధించిన ప్రాథమిక నివేదికను సీఎంకి అందించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్యారిస్‌లోని యునెస్కోతో సంప్రదింపులు ప్రారంభించడానికి నిపుణుల కమిటీని నియమించాలని కోరారు. వీరభద్రస్వామి కుడ్య చిత్రం ఆసియాలోనే అతి పెద్దదన్నారు. ఏకశిలా నంది విగ్రహం, ఎత్తైన నాగలింగం, నాట్యమండపంలోని నిలువు శిల్పాలు, అద్భుతమైన తైలవర్ణ చిత్రాలు, ఛాయా చిత్రాలకు సంబంధించి నివేదికలో పొందుపర్చామన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు వస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు మైనాస్వామి వివరించారు.

వన్య ప్రాణులను రక్షించుకుందాం

డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి స్వాతి



ఈతోడు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఏర్పాటు చేసిన కెమెరా

తనకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సమష్టిగా వన్యప్రాణులను పరిరక్షించుకుందామని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (ప్రపంచ నిధి) ప్రతినిధి స్వాతి పిలుపునిచ్చారు. మండలంలోని ఈతోడు, చిన్నరామన్నగారిపల్లి, కొక్కంటి గ్రామాల పరిధిలోని అడవుల్లో ఆమె.. గురువారం ప్రజలతో కలిసి పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వన్యప్రాణులు అంతరించి పోతున్నాయన్నారు. ఇప్పటికే ఈప్రాంతంలో తోడేళ్లు కనుమరుగయ్యాయన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ కోసం డబ్ల్యూడబ్ల్యూఎఫ్.. వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలతో కలిసి పని చేస్తోందన్నారు. అందులో భాగంగానే మండలంలోని ఈతోడు, చిన్నరామన్నగారిపల్లి, కొక్కంటి పాఠశాల ప్రహరీలకు ఈప్రాంతంలోని వన్య ప్రాణుల బొమ్మలను చిత్రీకరించామన్నారు. అడవిలో ఏయే జంతుజాతులున్నాయో తెలుసుకోవడానికి చిన్నరామన్నగారిపల్లి, ఈతోడు అటవీ ప్రాంతాల్లో ఆరు కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా రాత్రి సమయంలో సంచరించే వివిధరకాల అడవి జంతువులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. గుర్తించిన జంతువుల సంరక్షణ, స్థావరాల ఏర్పాటు, వాటి సంతతి పెంపొందేలా చర్యలు చేపడుతున్నామని ఆమె వెల్లడించారు. ఆమెతోపాటు జనజాగృతి ఈడీ రాంప్రసాద్, గ్రామాల ప్రజలు ఉన్నారు.

బంధాలు సరిగా లేక..!

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో నాలుగు ఘటనలకు కుటుంబ పరమైన గొడవలే కారణం కావడం గమనార్హం. భార్యభర్తల మధ్య సంబంధాలు బెడిసికొట్టడం, మద్యం, వేధింపులు, వివాహేతర సంబంధం.. ఇలా ఏదో ఒక కారణంతో నలుగురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు.

అత్తారింటి వేధింపులతో అల్లుడు..



కేశవ(ఫైల్)

పరిగి మండలం శాసనకోటలో కేశవ(30) అనే వ్యక్తి బుధవారం ఉరివేసుకున్నాడు. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన మేరకు, సోమందేపల్లి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన గుట్టూరు కేశవ నాలుగేళ్ల క్రితం శాసనకోటకు చెందిన శృతిని వివాహం చేసుకున్నాడు. పుట్టింటికి వెళ్లిన భార్య ఎంత బతిమాలినా తిరిగి రాలేదు. దీంతో కేశవ అత్తారింట్లోనే నాలుగేళ్లుగా ఉంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పని చేసే కేశవను భార్య శృతి, అత్త, బావమరిది తరచూ వేధించేవారు. అవమానం భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకున్నాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేశవ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు శృతి, ఆమె తల్లి, సోదరుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..



శంకర్

భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన శంకర్(46) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శివరాముడు తెలిపిన మేరకు, ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ సిద్ధన్నగారిపల్లికి చెందిన శంకర్.. ఆయన భార్య తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లారు. కాపురానికి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన శంకర్.. బుధవారం రాత్రి రాళ్ల అనంతపురం - సిద్ధన్నగారిపల్లి రోడ్డు మధ్యలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శంకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై..



రమేష్

నార్పల లోని శక్తినగర్ కాలనీలో రొట్టెల రమేష్(39) అనే వ్యక్తి ఉరివేసుకున్నాడు. రమేష్ మద్యానికి బానిసై తరచూ భార్య, తండ్రితో గొడవపడేవాడు. మద్యం అలవాటు మానుకోవాలని వారు చెప్పినా వినుకోలేదు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో లోపల గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

వివాహేతర సంబంధం ఉందని..



నంజుండ

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో బుధవారం రాత్రి నంజుండ(33) ఉరి వేసుకున్నాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు, నంజుండ బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన భార్యకు వివాహేతర సంబంధం ఉందని మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుమారుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు కిందకు దించి, పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తన సోదరుడి ఆత్మహత్యకు అతని భార్య నాగవేణి, సీపీఎం రమేష్ కారణమని నంజుండ సోదరుడు ముత్యాలప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీతోట ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో యువకుడు..



షెక్షావలి (ఫైల్)

ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ సమీపంలో గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి షెక్షావలి (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు, కాలనీకి చెందిన అబ్దుల్ ఖాదర్‌వలీ కుమారుడు షెక్షావలి నాలుగేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో తాను చనిపోతానని మూడు రోజులుగా తల్లిదండ్రులకు చెబుతుండేవాడు. నయమవుతుందని వారు ధైర్యం చెప్పేవారు. ఈ క్రమంలో రైలుకింద పడ్డాడు. మృతదేహాన్ని నాందేడ్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ గమనించి, హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

అనంతపురం సెంట్రల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఉద్యోగం చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మెకట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులన్నారు. జర్మన్ భాషపై శిక్షణ, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశామన్నారు. జర్మన్ భాషపై రాష్ట్రంలో ఆన్‌లైన్ శిక్షణ పూర్తిచేసిన వారికి రెండో విడతగా దేశ స్థాయిలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం మైగ్రేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసులోపు వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోగా naipunya m.ap.gov.in/programregistration పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9988 853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు మూడేళ్ల జైలు

అనంతపురం క్రైం,మార్చి 13(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులకు గురిచేసి భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. ఈ మేరకు గురువారం మహిళా కోర్టు సెషన్స్ న్యాయాధికారి శోభారాణి తీర్పు వెలువరించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన జింకల పోతన్నకు పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన అనూషతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.లక్ష నగదు, 15 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. ఏడాది పాటు అన్యోన్యంగా ఉన్నా, మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న పోతన్న భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. వేధింపులు భరించలేక 2018 ఫిబ్రవరి 7వ తేదీ అనూష ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఆత్మకూరు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేయగా, డీఎస్పీ వెంకటరావు దర్యాప్తు చేసి మహిళా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శోభారాణి ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సుజన వాదించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేష్ నాయక్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ శౌ రెడ్డి, కానిస్టేబుల్ షెక్షావలి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరపరిచినందుకు ఎస్పీ జగదీష్ అభినందించారు.

హనుమంత వాహనంపై దేవదేవుడు

భక్తులను అనుగ్రహించిన కోనేటి రాయుడు



హనుమంతువాహనంపై శ్రీవారు

కదిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గురువారం హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం నిత్యపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. త్రేతా యుగంలో రామలక్ష్మణలను తన భుజస్కందాలపై మోసిన హనుమంతుడు.. కలియుగంలో నారసింహుడికి వాహనంగా మారి, తన కోరికను తీర్చుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగులు, మల్లెల సౌరభాల నడుమ తిరువీధుల్లో విహరించిన స్వామివారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. నారసింహుడి నామస్మరణతో కదిరి వీధులు మార్మోగాయి. వేడుకలలో ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మగరుడ సేవ

బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారికి బ్రహ్మగరుడ సేవ నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతున్ని నారసింహుడికి వాహనంగా పంపుతారని, అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మగరుడ సేవ అని పిలుస్తారని వేద పండితులు చెబుతారు. స్వామివారికి ఉదయం నిత్య పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. సంధ్యా సమంలో గరుడ దండం ప్రతిష్ఠించి, శ్రీవారిని తిరువీధు ల్లో ఊరేగిస్తారు. కొక్కంటి పాలెగాళ్లు శనివారం నుంచి శ్రీవారి సేవలో భాగస్వాములై దివిటీని మోస్తారు.



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

నేర రహిత జిల్లాగా మార్చుదాం

మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి: ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాను నేరరహితంగా మార్చుదామనీ, ఇందులో మహిళల పాత్ర కీలకమని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని అప్పలకుంట క్రాస్ వద్దగల కల్యాణమండపంలో గురువారం మహిళా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హిందూపురం అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి లలితాలక్ష్మి, ఎస్పీ హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ... చైతన్యంతోనే మహిళలు సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కుటుంబం చాలా శక్తివంతమైనదనీ, దానిని కాపాడుకోవాలన్నారు. నేరాలకు పాల్పడితే చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. ప్రతి మహిళ, బాలికలు మొబైల్ ఫోనులో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి లలితాలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు ఇప్పుడిప్పుడే ఉద్యోగాల కోసం బయటకు వచ్చి పురుషులతో సమానంగా రాణిస్తున్నా రన్నారు. ఉద్యోగాలు చేసే ప్రాంతాల్లో మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనంతరం బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీడీపీఓ శాంతి, సీఐలు ఆంజనేయులు, జనార్దన్, కరీమ్, మహిళలు పాల్గొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.25 వేలు

అనంతపురంరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.25,630, కనిష్ఠంగా రూ.2,800, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 233టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

18న ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు వైద్యశాఖ ముహూర్తం ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 205 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. అర్హుల జాబితాను గురువారం డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి విడుదల చేశారు. ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహించి, స్థానాలను కేటాయిస్తారు. కొత్త స్థానాల్లో విధులలో చేరి, రిలీవ్ కావాలని, తిరిగి ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని డీఎంహెచ్ఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పీహెచ్ సర్టిఫికెట్లు పెట్టిన వారిని పరిశీలన కోసం మెడికల్ బోర్డుకు రెఫర్ చేశామని డీఎంహెచ్ఓ తెలిపారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం మార్కెట్‌కు 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7 కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

తప్పు చేస్తే ఉపేక్షించను: ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం విద్య, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్స్, స్పాట్ వాల్యుయేషన్‌లో తప్పు జరిగితే ఉపేక్షించేది లేదని పాఠశాల విద్య కడప ఆర్జేడీ శామ్యూల్ హెచ్చరించారు. బాగా చదివి రాసిన విద్యార్థులకు న్యాయం జరగాలని ఆయన అన్నారు. రాయలసీమ జోన్ 10వ తరగతి పరీక్షల కోడింగ్, అసిస్టెంట్ కోడింగ్ అధికారులకు రాయలసీమ జిల్లాల డీఈఓలతో కలసి ఆయన సైన్స్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. డీఈఓలు, ఏసీలు ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కడా కాపీయింగ్ జరగకుండా చూడాలని అన్నారు. పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు పకడ్బందీగా, నిజాయతీగా వ్యవహరించాలని సూచించారు. రాసిన విద్యార్థులకు, రాయని విద్యార్థులుకు ఒకే తరహా మార్కులు రాకుండా చూడాలని అన్నారు. స్పాట్‌లో పనిచేసే అధికారులు చదివిన పిల్లలకు న్యాయం జరగాలన్న ఆలోచనతో ఉండాలని సూచించారు. ఏ జిల్లాలోనైనా డీఈఓలు, ఏసీలు ఉపేక్షిస్తే వెంటనే తన దృష్టికి తేవాలని సూచించారు. తనకు చిన్న మెసేజ్ పంపినా వెంటనే స్పందిస్తానని అన్నారు. స్పాట్ వాల్యుయేషన్ సమయంలో ఎవరూ సెల్ ఫోన్ వాడకుండా చర్యలు తీసుకోవాలని డీఈఓలు, ఏసీలను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు డీఈఓ శామ్యుయల్, అన్నమయ్య డీఈఓ సుబ్రమణ్యం, కడప డీఈఓ, ఏసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితాల తరువాత సమీక్షలతో ప్రయోజనం లేదు

పదో తరగతి పరీక్షల ఫలితాల తర్వాత సమీక్షలు పెట్టినా ప్రయోజనం ఉండదని, పరీక్షల్లోనే నిజాయతీగా పనిచేయాలని ఆర్జేడీ సూచించారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, పరీక్షల వేళ ఆత్మసాక్షితో పనిచేయాలని సూచించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మీటింగ్ హాల్‌లో సీఎస్, డీఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. మంచి సమాజ నిర్మాణం ఒక్క విద్యాశాఖ వల్లే సాధ్యమవుతుందని అన్నారు. పరీక్షలలో తప్పులు జరగకుండా చూడాలని అన్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ హాజరయ్యారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



సత్యనారాయణ(ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అరటి పంట సాగు చేసి నష్టపోయిన రైతు సత్యనారాయణ(40) ఆత్మహత్యాయత్నం చేశారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు, పుట్లూరు మండలం ఓబుళాపురానికి చెందిన సత్యనారాయణ ఐదెకరాలలో అరటిపంట సాగు చేశారు. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. రూ.15 లక్షలు వరకు అప్పులు పేరుకుపోయాయి. దీంతో ఈ నెల 11న ఇంట్లో చెప్పి అనంతపురం వచ్చి, నవ్య లాడ్జిలో ఓ గది అద్దెకు తీసుకున్నారు. అదే రోజు అర్ధరాత్రి విషం తాగారు. ఈ నెల 12న భార్య విజయలక్ష్మి ఫోన్ చేసినా స్పందించలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి లాడ్జి గదిలో చూసేసరికి అపస్మారక స్థితిలో కనిపించారు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. రైతు మృతితో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుపై దాడికి యత్నించిన చిరుత

కంబదూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలను చిరుత భయపెడుతోంది. భీములకుంట రోడ్డు సమీపంలో ఉన్న కొండలో చిరుత సంచరిస్తోంది. కంబదూరుకు చెందిన రైతు నరసింహులుపై గురువారం తెల్లవారుజామున దాడికి యత్నించింది. ద్విచక్రవాహనంలో తోటకు వెళుతుండగా పొదల నుంచి ఒక్కసారిగా అడ్డు వచ్చింది. దీంతో రైతు భయపడి ద్విచక్రవాహనాన్ని వదిలేసి కేకలు వేస్తూ పరుగుపెట్టారు. చుట్టుపక్కల రైతులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో చిరుత కొండలోకి పారిపోయింది. ఇటీవల ఈ కొండ ప్రాంతంలో చిరుత, ఎలుగుబంట్ల సంచారం, దాడులు పెరిగిపోయాయి. రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. అటవీశాఖ అధికారులు స్పందించి, రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

కొండకు చేరిన కాటమయ్య స్వామి ప్రభ


కాటమయ్య స్వామి ప్రభ

బత్తలపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం కాటమయ్యస్వామి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం సమీప గ్రామాల ప్రజలు పన్యరపు బండ్లు కట్టారు. ఈ బండ్లలో కొండవద్దకు చేరుకొని కొండచుట్టు ప్రదక్షణలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి కాటమయ్యస్వామి ఉత్సవ ప్రభను రకరకాల పూలతో అందంగా అలంకరించి.. ముస్టురు గ్రామం నుంచి ఊరేగింపుగా కాటమయ్య స్వామి కొండకు తీసుకొచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక గుట్టకిందపల్లి వద్దగల ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణతలైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులను మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ఎంపిక చేస్తామని, మరిన్ని వివరాలకు 79811 71568, 7799004659ను సంప్రదించాలని అన్నారు.

సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు

నల్లమాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సబ్సిడీతో వ్యవసాయ పనిముట్ల కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ పనిముట్లు, విత్తన గొర్రు, ఐదు మడకల గుంటక, పాసే గుంటకలు 23 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈనెల 23లోపు రైతుసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ఓబుళదేవరచెరువు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడీ చెరువు, కొండకమర్ల, మిట్టపల్లి, గౌనిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 286 మంది విద్యార్థులకు రూ.30 వేల విలువ చేసే పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులకు అట్టలు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను దాతలు వెంకటసాయి ఐటీఐ విద్యాసంస్థ అధినేత సుధాకర్, హెచ్ టూ హె చారిటబుల్ టస్టు ఛైర్మన్ రవినాయక్ అందించారు.

● ముదిగుబ్బ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి స్థానిక బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 84 మంది విద్యార్థులకు రూ.ఆరు వేల విలువైన పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.

బీసీ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలికి సన్మానం

ధర్మవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జయశ్రీ.. బీసీ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎంపిక కావడంతో ఆమెను ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు గురువారం సన్మానించారు. సోమవారం మంగళగిరిలో జరిగిన రాష్ట్ర బీసీ సంఘం సమావేశంలో ఆమెను ఎన్నుకున్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండండి

ధర్మవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో చాలా మంది ఆరుబయట, మిద్దెల మీద పండుకుంటారని, దీన్ని ఆసరాగా చేసుకొని ఇళ్లల్లో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశముందని, కావున అందరూ అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా వార్డుల్లో కొత్త వ్యక్తులు వచ్చినా.. ఎవరిపైనా అనుమానం వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రతిరైతుకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ఓబుళదేవరచెరువు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పొలం ఉన్న ప్రతి రైతు ఆ గ్రామానికి సంబంధించిన రైతు సేవా కేంద్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తప్పకుండా పేరు నమోదు చేసుకోవాలని ఏఓ ఇలియాజ్ అహమ్మద్ గురువారం తెలిపారు. ఆ గుర్తింపు సంఖ్య ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలకు అర్హులన్నారు.

నాటుసారా అనర్థాలపై అవగాహన

కదిరిఅర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నాటుసారాను తాగడం వల్ల కలిగే అనర్థాలను ఆర్డీఓ వీవీఎస్ శర్మ మండలంలోని బత్తపల్లి తండా, కట్లతండా, బాలప్పగారిపల్లితండాల్లో అవగాహన కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓతో పాటు అనంతపురం జిల్లా ప్రొబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హాజరయ్యారు. నాటు సారాలో విషపూరితమైన రసాయనాలు ఉండడంతో కిడ్నీలు, నాడీ వ్యవస్థ దెబ్బతిని.. మరణించే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు గోవిందునాయక్, నరసింహులు, శ్రీధర్, దత్తాత్రాయ, సిబ్బంది, అటవీఅధికారులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు ఘన నివాళి

ధర్మవరంరూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పలువురు పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఇందులో ఎంపీడీఓ సాయిమనోహర్, ఈఓఆర్డీ మమతాదేవి, ఏఓ అబ్దుల్‌నబీ, సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు.

● ధర్మవరం : స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మొల్లమాంబ చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఇందులో కుమ్మరని కుల అధ్యక్షుడు రాఘవేంద్ర, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ పొలప్ప, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ సందడి

పుట్టపర్తి రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలో హోలీ సందడి కనిపించింది. హోలీ పండుగను పురస్కరించుకుని బాలవికాస్‌కు చెందిన సాయిభక్తులు గురువారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన సాయిభక్తులు రెండోరోజు పర్తి యాత్రలో భాగంగా గురువారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఉదయం వేదపఠనం అనంతరం భక్తిగీతాలను అలపించారు. సాయంత్రం బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన భారత్ మిలాప్ నృత్యరూపకం ఆహూతులను అలరించింది. రామాయణంలోని రామభరతుల అనుబంధంపై ప్రదర్శించిన నృత్యరూపకం భక్తిరసాన్ని పంచింది. మహామంగళహారతి అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

పంట రక్షణకు పాట్లు

వేరుశనగకు అడవిపందులు, నెమళ్ల బెడద

కాపాడుకునేందుకు రైతుల తంటాలు

రేయింబవళ్లు పొలాల్లో పడిగాపులు


బుడ్డారెడ్డిపల్లిలో అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం పొలం చుట్టూ ఏర్పాటు చేసిన చీరలు

ధర్మవరంరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని సమయాలల్లో.. అన్ని విధాలుగా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. తెగుళ్ల బెడద నుంచి రక్షించుకున్న పంటకు నేడు అడవి పందులు, నెమళ్ల బెడద పట్టుకుంది. అవి పంటలపై దాడి చేసి.. నాశనం చేస్తుండటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో రబీలో వేరుశనగ పంటను సుమారు 1000 హెక్టార్లకు పైగా సాగుచేశారు. మొదట్లో పలు తెగుళ్ల సోకడంతో వేలకు వేలు వెచ్చించి.. మందులు పిచికారి చేసి.. పంటను కాపాడుకున్నారు. పంటను రక్షించుకున్నామని రైతులు ఊపిరిపీల్చుకునేలోపే సమస్య మరో రూపంలో ఎదురైంది. ప్రస్తుతం కాయలు దిగడంతో అడవిపందులు, నెమళ్లు వాటిని తినేస్తున్నాయి. వాటి నుంచి పంటను కాపాడుకోవడానికి నిత్యం పొలాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. రోజురోజుకూ అవి పంటలను నాశనం చేస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఒక్కోసారి రాత్రి వేళల్లో అడవి పందులు రైతులపై దాడి చేసిన సంఘటనలూ లేకపోలేదు.

● రక్షణకు నానాతంటాలు: వేరుశనగ దిగుబడి సమయంలో కాయలను తినేందుకు అడవిపందులు, నెమళ్లు వస్తున్నాయి. వాటి నుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. పొలాల చుట్టూ చీరలు చుట్టడం, రాత్రివేళాల్లో మైకుల ద్వారా అరుపులు, తప్పెట్లు కొట్టడం, పలుచోట్ల పొలం చుట్టూ ఇనుప తీగలు చుట్టడం తదితర పనులు చేస్తున్నారు. నెమళ్లు ఉదయం, సాయంత్రం వచ్చి వేరుశనగ చెట్టు చుట్టూ మన్ను బాగా తోడేసి.. కాయలన్నీ తినేసి వెళ్తున్నాయి. ఇక రాత్రివేళాల్లో అడవిపందులు చేనులలో విత్తనాల కోసం గుల్లగించడం చేస్తున్నాయి. దీంతో పంట తమ కళ్ల ముందే నాశనం అవుతోందని రైతులు విలపిస్తున్నారు.

నిత్యం పొలాల వద్దే..



నేను మూడు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాను. ప్రస్తుతం కాయలు బాగా వచ్చాయి. వాటిని తినేందుకు పగలు నెమళ్లు, రాత్రివేళాల్లో అడవిపందులు వస్తున్నాయి. వా టి బెడద నుంచి రక్షించుకునేందుకు నానాతంటాలు పడుతున్నాం. రాత్రి, పగలు పొలాలే వద్దే పడికాపులు కాస్తున్నాం. మైకుల్లో అరుస్తూ.. చీరలు ఎన్ని చుట్టినా వాటిబెడద నుంచి తట్టుకోలేకపోతున్నాం. పంటలు రక్షించుకోవాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

-కృష్ణానాయక్, నేలకోటతండా

నానా తంటాలు పడుతున్నాం



నేను నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాను. పంట దిగుబడి సమయంలో అడవిపందులు దాడిచేయడంతో పాతచీరలను కొనుగోలు చేసి పొలం చుట్టూ కట్టేశాను. వేలకు వేలు వెచ్చించి పంటకు మందులు పిచికారీ చేసి తెగుళ్ల బెడద నుంచి పంటను కాపాడుకుంటే తీరా కాయలు వచ్చాక అడవిపందులు, నెమళ్లు దాడిచేసి తినేస్తున్నాయి. వాటి నుంచి రక్షించేకునేందుకు నానాతంటాలు పడుతున్నాం.

-జయప్రకాష్‌రెడ్డి, బుడ్డారెడ్డిపల్లి

బాధిత రైతు పొలం పరిశీలన

బత్తలపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలతో నష్టపోయిన మండలంలోని డి.చెర్లోపల్లికి చెందిన మురళి పొలాన్ని హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి, ఏఓ ఓబిరెడ్డి గురువారం పరిశీలించారు. మురళి తనకున్న 3.74 ఎకరాల పొలంలో కలింగర మాక్స్ రకాన్ని సాగు చేశాడు. పంట కాల పరిమితి 75రోజులు దాటినా కాయ లోపల తెలుపు ఉండడంతో నకిలి విత్తనాల వల్ల నష్టపోయనని గుర్తించాడు. బుధవారం ఆత్మహత్యాయత్నం చేసుకోగా.. అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అధికారులు ఆ రైతు పొలాన్ని గురువారం పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. వారి వెంట వ్యవసాయాధికారి నాగార్జున ఉన్నారు.

● బాధితులను ఆదుకోవాలి

ధర్మవరంరూరల్ : నాసిరకం విత్తనాలతో నష్టపోతున్న రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ క్రిష్ణయ్యకు ఏపీ రైతు సంఘం నాయకులు గురువారం విజ్ఞప్తిచేశారు. జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. బత్తలపల్లి మండలం డి చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు మురళీకి.. అనంతపురంలోని శ్రావణి ఎరువుల దుకాణాదారులు నాసిరకం కళింగరకాయ విత్తనాలు విక్రయించారని మండిపడ్డారు. మురళీ ఆ షాపు వద్దకు వెళ్లి నిలదీయగా.. ఆ షాపు యాజమానులు అతనిపై దాడికి యత్నించారని, దీంతో ఆ రైతు అవమానంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ప్రస్తుతం ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నారు. ఆ షాపు యాజమాన్ని అరెస్టు చేసి షాపును సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆ రైతు కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి, ఎల్ ఆదినారాయణ పాల్గొన్నారు.

● మంత్రి దృష్టికి తీసుకెళ్తాం

ధర్మవరం : కల్తీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ విషయాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.... రైతులకు అనంతపురంలోని శ్రవణి సీడ్స్ అధినేత మధుసూదన్ గుప్తా కల్తీ విత్తనాలను విక్రయించడం వల్ల అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. బత్తలపల్లి మండలం డి చెర్లోపల్లి గ్రామానికి చెందిన మురళి అనే రైతు కల్తీ విత్తనాలతో మోసపోయానని అనంతపురంలో బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఆ రైతును పరామర్శించి ధైర్యం చెప్పామన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు.


డి.చెర్లోపల్లి వద్ద కలింగర పంటను పరిశీలిస్తున్న అధికారులు


ధర్మవరంలో ఏడీఏకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లైనింగ్ వల్ల రైతులు నష్టపోరాదు

టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ వల్ల రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మైనర్ ఇరిగేషన్ అధికారులను విజ్ఞప్తి చేశారు. మండలంలోని యోగివేమన రిజర్వాయర్‌తో పాటు చెరువులకు హంద్రీనీవా నీరు అందే విధంగా చూడాలని కోరారు. మండలంలోని హంద్రినీవా కాలువతో పాటు పలు గ్రామాల్లో చెరువులను ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. హంద్రీనీవా ఎస్ఈతో శ్రీరామ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ ప్రాంత కాలువలకు తూములు ఏర్పాటు చేసి.. చెరువులకు నీరందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా నీరు అందిస్తామని జలవనరుల శాఖ మంత్రి హామీ ఇచ్చారని శ్రీరామ్ తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, కోట్ల బాబి, వినోద్‌బాబు, సూర్యశేఖర్ రాజు, మహబూబ్‌పీరా ఉన్నారు.

● బీజేపీ ఇన్‌చార్జ్..: బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు మండలంలోని మలకవేముల క్రాస్‌లో హంద్రీనీవా కాలువను గురువారం పరిశీలించారు. ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట్రావ్‌తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, అంజనరెడ్డి, మంజునాథ్ ఉన్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను ఆదుకోండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో కోరారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2018లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు సొంతింటి కళను నిజం చేయాలనే లక్ష్యంతో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. అయితే తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల కట్టిన డిపాజిట్టు రాక.. బ్యాంకు వారు ఇచ్చిన రుణాలను చెల్లించలేక లబ్ధిదారులు డిఫాల్టరుగా మారిపోయారన్నారు. వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్లను సకాలంలో పూర్తీ చేసి అర్హులైన లబ్ధిదారులకు అందచేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి వారికి తగిన న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు.

● హోలీ శుభాకాంక్షలు: నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఎమ్మెల్యే హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

పశు బీమాతో ఆర్థిక భద్రత


బీమా చేయించిన పాడి ఆవు చెవికి.. ఐడీ నెంబర్ ప్లేట్ వేస్తున్న సిబ్బంది

నల్లమాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాడిరైతులను దృష్టిలో పెట్టుకుని పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రతి పాడిరైతు తప్పకుండా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెడ్డిపల్లి పశువైద్యాధికారి రవీంద్రనాయక్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాడి రైతు పశువు ఆకాల మరణం వల్ల ఆర్థికంగా నష్టపోకూదన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న పాడి రైతులు గరిష్టంగా ఐదు పశువులకు బీమా చేసుకోవచ్చన్నారు. పాడి రైతులు సమీపంలోని రైతు సేవ కేంద్రానికెళ్లి పశువైద్య సిబ్బందితో బీమా చేయించుకోవాలన్నారు. పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకల పెంపకందారులు బీమా చేయించుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి శ్రీగిరి ప్రదక్షిణను గురువారం ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ప్రశాంతినిలయం గణేష్ గేట్ వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి భక్తిగీతాలు అలపిస్తూ రథాన్ని లాగుతూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. గోకులం, గణేష్ కూడలి, పెట్రోలు బంకు, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, సత్యమ్మ ఆలయం, గోపురం మీదుగా తిరిగి గణేష్ కూడలికి చేరుకున్నారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

చెత్త తొలగింపు



చెత్త తొలగించిన సిబ్బంది

ధర్మవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదీన మసీదు వద్ద నాలుగు రోజుల క్రితం డ్రైనేజీలో పూడిక తీసిన పారిశుధ్య కార్మికులు.. దాన్ని అలాగే రోడ్డుపై వదిలేసి వెళ్లారు. దీంతో దుర్వాసనతో ఆ ప్రాంత వాసులు, మసీదుకు వెళ్లే ముస్లింలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై గురువారం పూడిక తీశారు... వదిలేశారు అనే పేరుతో ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ అధికారులు రోడ్డుపై పడేసిన చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కదిరి/ కొత్తచెరువు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కదిరి మండలంలోని దిగువపల్లిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కె. ఓబులేసును సస్పెండ్ చేసినట్లు డీఈఓ కిష్టప్ప గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఓబులేసు కొన్ని రోజులుగా ఆర్థిక వ్యవహారంలో అవకతవకలకు పాల్పడడం, నాడు నేడు నిధులు రూ.48వేలు ప్రభుత్వ ఖాతాకు జమచేయకుండా తన వద్ద ఉంచుకున్నట్లు విచారణలో తేలిందని ఆ ఉత్తర్వులో తెలిపారు. దీంతో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సస్పెన్షన్ ముగిసేవరకు పాఠశాలలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకూడదని డీఈఓ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిమర్రి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు గ్రామ సరిహద్దుల్లో పేకాట ఆడుగుతున్న ఐదుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు. రూ.5,180 నగదు, మూడు బైకులు స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

కదిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ. మూడు లక్షలు మోసం చేసిన సంఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాలిటీ పరిధి కుటాగుళ్ల గ్రామానికి చెందిన ముళ్ల మోహరుద్దీన్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని అదే గ్రామానికి చెందిన కె.రాజు నమ్మబలికాడు. హైదరాబాద్‌లో నాగచంద్ర అనే వ్యక్తి తనకు తెలుసునని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని సంవత్సరం క్రితం రూ.మూడు లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మొదట రూ.25వేలు ఇప్పించుకున్నాడు. రెండు నెలల పాటు ఆన్‌లైన్‌లో ట్రైనింగ్ ఇప్పించాడు. అనంతరం రూ.2.75 లక్షలను వసూలు చేశాడు. పది నెలలైనా ఉద్యోగం చూపించకపోవడంతో రాజు, నాగచంద్రపై మోహరుద్దీన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసుల పేలుడు

మొత్తం రూ. ఏడు లక్షల నష్టం


చెలరేగుతున్న మంటలు

నల్లచెరువు మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి పక్కనే ఉన్న దామోదర వేరుశనగ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ. ఐదు లక్షల విలువైన టపాసులు పేలడంతో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గంట వ్యవధిలో నిల్వ ఉంచిన టపాసులు మొత్తం కాలిపోయాయి. అంతే కాకుండా ఆ గది పక్కనే నిల్వ ఉంచిన రూ.రెండు లక్షల విలువైన కర్బూజా కాయలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. సమీపంలో ఇళ్లు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పినట్లైంది. ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని.. మంటలను అదుపు చేసింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి

బుక్కపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతానికెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోయారు. వేసవిలో కనీసం నీటి సదుపాయం కూడా కల్పించడం లేదన్నారు. కేవలం నీటికుంటల పనులు మాత్రమే ఉండడంతో కూలీలు పనులుచేయలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సౌకర్యాలు కల్పించి ఇబ్బంది లేకుండా చూడాలని కూలీలు కోరారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఉన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కండి: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాలోని పరిశ్రామల యజమాన్యలు భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో జిల్లాలోని పరిశ్రమల ప్రతినిధులతో సీఎస్ఆర్ నిధుల వినియోగంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజాహితం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో పరిశ్రమల యాజమాన్యం భాగస్వామ్యం కావాలన్నారు. అందుకోసం సీఎస్ఆర్ నిధులను ప్రణాళిక బద్ధంగా వినియోగించాలని సూచించారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టే పనుల్లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను విధిగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు, ఆరోగ్యకేంద్రాల సంరక్షణ కార్యకలాపాలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, డీపీఓ సమత, సీపీఓ విజయ్‌కుమార్, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం

కదిరిఅర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల అసోషియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్.. టెక్నీషియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. నాగేంద్రనాయక్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కదిరి తాలూకా ఎన్జీఓల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, వైద్య సిబ్బంది దేవల నాయక్, మహబూబ్ బాషా, శశిధర్, శంకర్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు సహకరిస్తే ఉద్యమిస్తాం

ధర్మవరంరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నకిలీ ప్లంబర్స్ యూనియన్ మాటున భూదోపిడికి పాల్పడిన వ్యక్తులను కాపాడుతూ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తే ఉద్యమిస్తామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని సీపీఐ నాయకులు, ప్లంబర్స్ సంఘం నాయకులతో కలిసి గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నటరాజకు వినతిపత్రం అందించారు. అనర్హులు ఇంటి నిర్మాణ పనులు ఆపకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధం చేయాల్సి వస్తుందని తెలిపారు. అక్రమార్కులను గుర్తించి వారిపైన కేసులు పెట్టేవరకు వదిలి పెట్టేప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవి, సహాయకార్యదర్శి రమణ, చేనేత కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్లంబర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆ నిధులను పరిశ్రమకే వినియోగించాలి

ధర్మవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కార్మికుల వేతనాలు, పరిశ్రమ నిర్వహణకు మాత్రమే వినియోగించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న కేంద్రప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కేవలం కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల కోసం మాత్రమే వినియోగించాలని, కార్మికుల వేతనాలు, ముడి సరుకులు కొనుగోలు చేయడానికి వినియోగించరాదని కేంద్రమంత్రి నిబంధన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

న్యూస్ బాక్స్

పకడ్బందీగా పది పరీక్షలు

గంగప్ప, ఎంఈఓ, హిందూపురం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు హిందూపురం ఎంఈఓ గంగప్ప తెలిపారు. టెన్త్ పరీక్షలకు సంబంధించి పలు విషయాలను ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: ఈ విద్యాసంవత్సరంలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు?

ఎంఈఓ: హిందూపురం మండలంలో 20 ప్రభుత్వ పాఠశాలలు, 13 ప్రైవేట్ పాఠశాలల్లో 3,345 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న: ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు?

ఎంఈఓ: పట్టణం, మండలంలో 13 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: పరీక్షా కేంద్రాల వద్ద ఎంతమంది విధులు నిర్వహిస్తారు?

ఎంఈఓ: 13 పరీక్షా కేంద్రాలకుగాను చీఫ్ కస్టోడియల్, కస్టోడియల్‌తోపాటు 160 మంది ఇన్విజిలేటర్లు, 13 మంది చీఫ్ ఇన్విజిలేటర్లు, మరో 13 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 13 మంది క్లర్కులు విధుల్లో పాల్గొంటారు.

ప్రశ్న: పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ఎంఈఓ: అన్ని ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి.

ప్రశ్న: ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించారా?

ఎంఈఓ: ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు సన్నద్ధం చేసేవిధంగా ప్రీఫైనల్ నిర్వహించాం. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించాం.

ప్రశ్న: ప్రశ్నపత్రాలు మండలానికి చేరాయా ?

ఎంఈఓ: మండలానికి సంబంధించిన ప్రశ్నపత్రాలు అబ్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు చేరాయి.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అమరాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ఆర్‌డీటీ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున్, సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలనచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాల్యవివాహాలు చేయరాదని సూచించారు. ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ మీనాక్షి, సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులను అందజేస్తున్న శ్రీనివాసరావు

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అందజేశారు. నియోజకవర్గంలోని ఆరుగురికి రూ.18 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే హిందూపురం నియోజకవర్గానికి సీఎం సహాయ నిధిలను అధిక మొత్తంలో తీసుకురావడం జరిగిందన్నారు. ఎవరైనా ప్రమాదంలో గాయపడి, లేదా ఏదైనా వ్యాధితో బాధపడుతూ ఉన్నవారికి ఆరోగ్యశ్రీ వర్తించనట్లయితే సీఎం సహాయ నిధి వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి, నాయకులు హెచ్ఎన్ రాము, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల పాఠశాలలకు మంజూరైన ఓపెన్‌జిమ్ నిర్మాణానికి కావాల్సిన అనువైన స్థలాన్ని టీడీపీ నాయకులు పరిశీలించారు. గురువారం మంత్రి సెక్రటరీ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీలు నాగలూరు నారాయణస్వామి, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, అడదాకులపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వర్ ప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి తదితరులు స్థానిక జూనియర్ కళాశాలలో జిమ్‌కు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

గోరంట్ల, మార్చి13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కవయిత్రి కుమ్మరి మొల్లమాంబ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంపీపీ ప్రమీల, పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఇచ్చుకోండి.. లేఅవుట్ వేసుకోండి

రెచ్చిపోతున్న పంచాయతీ కార్యదర్శులు

అహుడా పరిధిలో బరితెగింపు

లక్షల్లో డిమాండ్ చేస్తున్న వైనం

ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న ఘటనలు



శిర-కొడికొండ జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఓ లేఅవుట్

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం అయ్యాయి. ఎక్కడగాని భూములు వ్యాపారాలు ముందుకు సాగలేదు. రియల్ వ్యాపారం అదఃపాతాళానికి పడిపోయింది. దీనివల్ల లేఅవుట్ వేయలేని పరిస్థితి. అయితే పంచాయతీ సర్పంచులు ఇప్పటికీ 95శాతం వారే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత భూముల వ్యాపారం పుంజుకుంటూ వస్తోంది. దీనివల్ల కొన్నిచోట్ల లేఅవుట్లు వేస్తున్నారు. అయితే కొంతమంది వైసీపీకి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఒత్తిడి పెట్టిస్తూ లేఅవుట్‌లు వేస్తున్నవారితో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో ఇప్పటికే కొన్నిచోట్ల అనుమతులు ఇవ్వడానికి పంచాయతీ కార్యదర్శులు లక్షల్లో డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొన్నిచోట్ల వైసీపీ సర్పంచులతోపాటు ఒకరిద్దరు కూటమి నాయకులు చేతులు కలిపి పంచాయతీ కార్యదర్శులతో డబ్బులు డిమాండ్ చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రెచ్చిపోతున్న పంచాయతీ కార్యదర్శులు

● లేపాక్షి మండల పరిధిలో రెండెకరాల్లోపే ఉన్న భూమిలో లేఅవుట్ వేసేందుకు పంచాయతీ నుంచి అనుమతి కావాలని రియల్టర్లు కోరారు. అయితే అందుకు ఓ కార్యదర్శి సుమారు రూ.10లక్షలు డిమాండ్ చేసి రూ.5లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు నియోజకవర్గంలో కోడై కూస్తోంది. లేపాక్షి మండల పరిధిలో ఓ పంచాయతీ హిందూపురం పట్టణానికి సమీపంలో ఉంది. ఇక్కడ మూడెకరాల లేఅవుట్ వేశారు. అందుకు పంచాయతీ నుంచి అనుమతి కోసం వెళ్తే ఏకంగా రూ.20లక్షలు డిమాండ్ చేసినట్లు రూ.10లక్షలకు వ్యాపారం కుదుర్చుకున్నట్లు సమాచారం. చిలమత్తూరు మండలంలో ఓ కార్యదర్శి లేఅవుట్ కోసం రూ.8లక్షలు డిమాండ్ చేసినట్లు బాధితులు ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఇదేమండలంలో జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఓ పంచాయతీ పరిధిలో రెండెకరాల లేఅవుట్ కోసం సదరు కార్యదర్శి రూ.10లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో లేఅవుట్‌లో వేస్తున్నవారిని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్న ఘటనలు పరిశీలిస్తే ఎవరుకూడా రూ.10లక్షలలోపు డిమాండ్ చేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది. దీంతో కొంతమంది అత్యుత్సాహం ప్రదర్శించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

అహుడా అనుమతి లేకుండానే..

హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాలు అహుడా కింద ఉన్నాయి. వాటి పరిధిలో లేఅవుట్ వేయాలంటే అహుడా అనుమతి పొందాలి. కొంతమంది రియల్టర్లు అహుడా అనుమతి మేరకు వేస్తే లాభం తగ్గుతుందన్న ఆలోచనతో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో కలిసి అనుమతి పొంది ప్లాట్లు విక్రయిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి భారీగా గండిపడే అవకాశం ఉంటుంది. పంచాయతీ నుంచి అనుమతి పొందితే తక్కువ మొత్తంలో పనిముగించుకుంటారు. అహుడా అయితే ఎక్కువ మొత్తంలో చెల్లించుకోవాల్సి ఉంటుంది. దీంతో పంచాయ తీ అనుమతుల మీదే రియల్టర్లు ఆధారపడి ఉంటారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

మాకొచ్చేది కొసరే కదా..

ఇదిలా ఉంటే పంచాయతీ కార్యదర్శుల మనోగతం వేరేలా ఉంది. మేము ఎంత డిమాండ్ చేసి తీసుకొచ్చినా కొసరు మాత్రమే మిగులుతోందని సర్పంచులు, మరికొందరు నాయకులకు సమర్పించుకోవాల్సి ఉంటుందని కొంతమంది బహిరంగంగా చెప్పుకుంటున్నారు. దీనివల్ల సర్పంచులకు, కూటమి నాయకులకు పంచడమేకాని మాకు మిగిలేది ఎంత అంటూ ప్రశ్నిస్తున్నారు.

కమనీయం.. నృసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చిలమత్తూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కనుమ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. బ్రహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న కార్యక్రమాల్లో స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత ప్రధానమైనది కావడంతో వీక్షించడానికి భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. అభిషేకాలు, అర్చనలు, హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత లక్ష్మీనృసింహుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిజిత్ లగ్నంలో కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేశారు. కల్యాణోత్సవం తరువాత భక్తులకు మంగళహారతి, తీర్థప్రసాదాలను వేదపండితులు అందజేశారు.

నేడు స్వామి వారి బ్రహ్మ రథోత్సవం

శుక్రవారం స్వామి వారి బ్రహ్మరథోత్సవం జరగనుంది. ఉదయం అభిషేకం, అర్చనలతో పూజలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి శుభ మిథున లగ్న పుష్కరాంశంలో బ్రహ్మరథోత్సవం భక్తుల జనసందోహం నడుమ సాగననుంది. అందుకు తగిన ఏర్పాట్లను ఆలయ కమిటీ చేపట్టంది. పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

నేడు కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం

పావగడ(ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవి సమేతుడై కొలువుతీరిన కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం ఫాల్గుణమాసం, పౌర్ణమి రోజున శుక్రవారం జరగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొననున్నారు.

హైవే విస్తరణ కోసం ఇళ్ల కూల్చివేత



ఆర్డీవో సమక్షంలో ఇళ్లను కూల్చివేస్తున్న సిబ్బంది

గోరంట్ల, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామంలో హైవే విస్తరణలో భాగంగా ఇళ్లను గురువారం ఆర్డీవో సమక్షంలో కూల్చివేశారు. బూదిలి ఎస్సీకాలనీలో మూడునెలల క్రితం 33 నివాసాలకు ప్రభుత్వం హైవే విస్తరణలో భాగంగా ఇళ్లు తొలగించాలన్న ప్రతిపాదనతో పరిహారం అందించింది. వారికి ఇంటి స్థలాలు ఇవ్వడానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. వారు ఇళ్లు ఖాళీ చేయకపోవడంతో ఆర్డీఓ గ్రామానికెళ్లి చర్చించి కొన్ని ఇళ్లను తొలగించారు. కొందరు రెండు రోజుల సమయం అడగడంతో ఆర్డీవో అంగీకరించారు. అనంతరం ముద్దనూరు టూ హిందూపురం ఎన్‌హెచ్ 716 జి రోడ్డు విస్తరణ కోసం 3.64 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండడంతో కొండాపురం ఆర్‌ఎస్కేలో ఆర్డీవో గ్రామసభ నిర్వహించి 35 మంది రైతులతో పరిహారం విషయంగా చర్చించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ మారుతి, ఎన్‌హెచ్ డిఈ గిడ్డయ్య, సిఐ శేఖర్, కార్యదర్శి గంగాధర్‌నాయక్, వీఆర్‌ఓలు అనిల్, సల్మాన్, ఓబులేసు, రమేష్, ప్రవీణ్, సర్వేయర్ చైతన్య ఉన్నారు.

వర్గీకరణ కోరుతూ బెంగళూరుకు పాదయాత్ర

పావగడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఏబీసీడీ వర్గీకరణ కోసం హరిహర నుంచి బెంగళూరుకు దళిత ఐక్యత మహాసభ ఆధ్వర్యంలో పాదయాత్ర ఈనెల 16 నుంచి నిర్వహించడం జరుగుతోందని, దళితులు పాల్గొనాలని నాయకులు డీజేఎస్ నారాయణప్ప, సుబ్బరాజు, రమేష్, పెద్దన్న పిలుపునిచ్చారు. గురువారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు నుంచి ఉత్తర్వులు అందినా ఇంతవరకు వర్గీకరణ చేయకపోవడం కర్ణాటక ప్రభుత్వ నిర్లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 16న పాదయాత్ర ప్రారంభించి 21న రాజ్‌భవన్‌కు చేరుకునేలా ప్రణాళిక ఉందన్నారు. వర్గీకరణ కోసం ఆమరణ నిరాహారదీక్షకైనా తాము సిద్ధమన్నారు.

వైసీపీ నాయకులు పోరుబాట చేపట్టడం దారుణం

తెలుగు యువత మడకశిర అధ్యక్షుడు బాలకృష్ణ

రొళ్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసి ప్రస్తుతం పోరుబాట చేపట్టడం విడ్డూరంగా ఉందని మడకశిర తెలుగు యువత అధ్యక్షులు బాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బకాయిలు పేరుకుపోయేలా చేసి ప్రస్తుతం ధర్నా చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

'గంగా కల్యాణి'ని సద్వినియోగం చేసుకోండి

పావగడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గంగా కల్యాణి పథకం కింద ఇస్తున్న మోటార్ పంప్‌సెట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సూచించారు. గురువారం గురుభవన మైదానంలో చిన్న నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో ఒక్కో రైతుకు రూ.9లక్షలు విలువ చేసే మోటార్ పంపుసెట్లను 25 మంది రైతులకు అందజేశారు. పంపుసెట్ల ద్వారా నీటి పంటలకు పెట్టి వాటిని సశ్యశ్యామలం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిన్న నీటిపారుదల శాఖ ఇంజనీరు నిత్తయ్య, మునిసిపల్ అధ్యక్షుడు రాజేష్, కౌన్సిలర్ రవి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా భజన మందిర వార్షికోత్సవం

పెనుకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆల్విన్ కాలనీలో వెలసిన షిర్డీసాయి, సత్యసాయి భజనమందిరం నిర్మించి 11వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం 5-30నుంచి 6-30వరకు భజనమండలి సభ్యులు పట్టణ పురవీధుల్లో నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రవీణ్‌కుమార్, వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో షిర్డీసాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మంగళహారతి తీర్థప్రసాద వినియోగం చేశారు. మధ్యాహ్నం నారాయణసేవ చేపట్టారు. పూజల్లో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ శంకర్ పాల్గొన్నారు.



భజనమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పేట వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పేట వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఉదయం జరిగింది. పర్యవేక్షణ అధికారి ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. 4 నెలలకుగాను ఆలయ హుండీ ఆదాయం రూ.19.99 లక్షలు వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ భగీరథీ నవీన్, కౌన్సిలర్ రాఘవేంద్ర, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు జేపీకే రాము, భారతి పాల్గొన్నారు.

ఆవుల అపహరణపై కేసు నమోదు

గోరంట్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచేపల్లికి చెందిన ఆరు పాడి ఆవులు చోరీ జరిగిన సంఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. బూచేపల్లికి చెందిన నారాయణస్వామి కుమారుడు వెంకటేశ్ ఇంటిముందు పశువుల పాకలో ఆరు జర్సీ ఆవులు ఫిబ్రవరి 22న చోరీకి గురయ్యాయి. వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పార్టీ ఆవిర్భావ సభకు జనసేన నాయకులు



పిఠాపురం బయలుదేరుతున్న జనసేన నాయకులు

చిలమత్తూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు చిలమత్తూరు మండలం నుంచి పెద్ద ఎత్తున జనసేన నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షులు చిన్న ప్రవీణ్, నాయకులు వెంకటరమణ, అగ్గి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు వెళ్లారు.

లేపాక్షి(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం జరగబోయే జనసేన పార్టీ ఆవిర్భావసభకు లేపాక్షి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం బయలుదేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకుల ఉమేష్ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా నాయకులు తరలివెళ్లారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చండి

మునిసిపల్ చైర్మన్ రమేష్



విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్

హిందూపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. గురువారం హిందూపురం పట్టణంలోని కల్లూరు ఓరియంటల్ పాఠశాలలో సరస్వతిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తుంటారని, అందుకు అనుగుణంగా పిల్లలు బాగా చదివి వారికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆయూబ్ పాల్గొన్నారు.

గ్లోబుల్‌జెన్ పాఠశాలలో..

పెనుకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాలలో గురువారం సరస్వతిపూజను నిర్వహించారు. ఈనెల 17 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానుండటంతో విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని చదువులతల్లిని ప్రార్థిస్తూ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మంజువాణి పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కన్వీనర్ శ్రీరాములు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం టీడీపీ నాయకులు అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సచివాలయంలో బీసీ వెల్ఫేర్ లాగిన్‌లో టైలరింగ్ శిక్షణపై ఆధార్, రేషన్, క్యాస్ట్ సర్టిఫికెట్లు అందించి దరఖాస్తు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయిన మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమనజయంతి నాయకులు మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, బలిజ సంఘం అధ్యక్షులు సూరీ, కృష్ణమూర్తి, చంద్రకాంతమ్మ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిబండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని సి.సి.గిరి ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాలనీవాసులకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మహిళలు నిరసన చేపట్టడంతో బస్సులు, వివిధ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. ట్యాంకర్ల ద్వారా సాయంత్రం నీటిని సరఫరా చేశారు.

కంటి అద్దాల పంపిణీ

సోమందేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఓంకార్ మాట్లాడుతూ పాపిరెడ్డిపల్లి వద్దగల కేజీబీవీ పాఠశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి అద్దాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అనిత, హెచ్‌ఎం నాగేంద్రప్రసాద్, సిబ్బంది లక్ష్మీదేవి, గంగమ్మ, నాగరత్నమ్మ, అశ్వత్థమ్మ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

సోమందేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నేరాలను అదుపు చేయడానికి గురువారం పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రద్దీ ప్రదేశాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయడంద్వారా నేరస్థుల కదలికలు గమనించవచ్చని ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు.

2500 ఇళ్లు మంజూరు

పావగడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలానికి ఎన్టీఆర్ గృహాల కింద 2500 ఇళ్లు మంజూరైనట్లు టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి తెలిపారు. త్వరలో హౌసింగ్ సిబ్బంది ఆయా లబ్ధిదారుల ఇళ్ల వద్ద మార్కింగ్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

రొళ్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవినకుంట తాండ, గొల్లహట్టి తండాలు కొన్ని నెలలుగా వీధి దీపాలు లేక అంధకారంలో ఉండేవి. విషయాన్ని సర్పంచ్ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా స్పందించలేదు. అక్కడి ప్రజలు రాత్రివేళల్లో భయాందోళనలకు గురవుతుండటాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు యోగానంద్ సొంత ఖర్చుతో గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేశారు.

ల్యాప్‌టాప్‌ల పంపిణీ

పావగడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తిరుమణి పాఠశాలలో 2024 సంవత్సరానికి గాను ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. సాయివసంత (560), సిద్దాపురం ఉన్నత పాఠశాలలో జశ్వంత్ (553), వైఎన్ హొసకోట ప్రభుత్వ పాఠశాలలో సిద్ద గంగమ్మ (546)మార్కులు సాధించారు. వీరికి ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్, బీఈఓ ఇంద్రాణమ్మ ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలను అధిరోహించాలని వారు సూచించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



తిప్పేబాయి (ఫైల్)

గోరంట్ల, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి తండాకు చెందిన తిప్పేబాయి (49) విద్యుదాఘాతంతో గురువారం మృతిచెందింది. శ్రీరామునాయక్ భార్య తిప్పేబాయి ఇంటి ముందు మోటారు ద్వారా నీటిని తోడే ప్రయత్నంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదంపై సీఐ శేఖర్ కేసు నమోదు చేశారు.